మైసమ్మ తల్లి ఆలయ హుండీల లెక్కింపు

హుండీల్లోని ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కడ్తాల్, మార్చి 27 : మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ దేవత, శివాలయ, రామాలయాలకు సంబంధించిన హుండీల్లోని ఆదాయాన్ని బుధవారం జిల్లా దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. 55 రోజులకు రూ.9,03,713ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్ట్ చైర్మన్ శిరోలీపంతూనాయక్ తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు, సీఐ ప్రతాపలింగం

పుస్తె మెట్టెలు అందజేత

యువతికి పుస్తె మెట్టెలు అందజేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి దంపతులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 27: తల్లిదండ్రులు చనిపోయి అనాథయిన ఓ నిరుపేద యువతి పెండ్లికి పుస్తె మెట్టెలు అందించి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దండెం రాంరెడ్డి ఔదార్యం చాటారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గండిచెర్వు గ్రామంలో నిరుపేద కుటుంబం మోడం సంతోష, బాల్‌రాజ్‌గౌడ్ దంపతులకు కూతురు అనూష ఉన్నది. దంపతులిద్దరూ ఇటీవల చనిపోవడంతో అనూష అనాథగా మారింది. అనూష వివాహం ఏప్రిల్ 4న జరిపేందుకు సమీప బంధువులు నిర్ణయించి.. సాయం అందించాలని రాంరెడ్డిని కోరారు. రాంరెడ్డి దంపతులు పెద్దఅంబర్‌పేటలోని నివాసంలో యువతికి పుస్తె మెట్టెలు, పట్టువస్త్రాలు అందించారు. కార్యక్రమంలో దానయ్యగౌడ్, మల్లారెడ్డి, రాంబాబు, పండుగుల సత్యనారాయణ, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

- బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎదిరె రాములు

చేవెళ్ల, మార్చి 27 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎదిరె రాములు అన్నారు. బుధవారం దేవుని ఎర్రవల్లిలో నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఆ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి మరోసారి బాటలు వేస్తామన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, బుచ్చయ్యగౌడ్, మహేందర్ రెడ్డి, జంగయ్య గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

సాగర్ రహదారిపై వెలుగులేవి?

- రహదారిపై వెలగని హైమాస్ట్ లైట్లు
- చీకటితో ప్రమాదాల బారిన ప్రజలు
- మరమ్మతులకు లక్షలు వెచ్చించినా ప్రయోజనం అంతంతే

తుర్కయాంజాల్, మార్చి 27:సాగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాల నిర్వహణకు నెలకు లక్షల రూపాయాలు వెచ్చిస్తున్నా అవి వెలగడం లేదు. చీకటితో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాల నిర్వహణ బాధ్యత ఈఈఎస్ఎల్ కంపెనీకి అప్పగించారు. ప్రతి నెలా సుమారు రూ.8 లక్షల వరకు వీధి దీపాల నిర్వహణకు తీసుకుంటున్న సదరు కంపెనీ మరమ్మతులను పూర్తిగా మరిచింది. ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పోలీస్ శాఖ వారు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో వెలగని వీధి దీపాలు

అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

సాగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగడం లేదని ఈఈఎస్ఎల్ సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. అయినా స్పందించడం లేదు. సమస్యను సీడీఎంఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

–మల్లికార్జున్, ఏఈ, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ

అధికారులు దృష్టి సారించాలి

సాగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి ఇప్పటికైనా అధికారులు వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా తుర్కయాంజాల్ ప్రధాన చౌరస్తాలో వీధి దీపాలు వెలగకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ఆర్‌అండ్ బీ, మున్సిపల్, పోలీస్ శాఖ వారు దృష్టి సారించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్, మార్చి 27 : కడ్తాల్ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తండ్రి గూడూరు నారాయణరెడ్డి (86) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో నారాయణరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీటీసీని పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, శాయిరెడ్డి, బీచ్చానాయక్, ఆంజనేయులు, భీక్యానాయక్, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, మల్లేశ్‌గౌడ్, నర్సింహ, జహంగీర్‌అలీ పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 27 : మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటాచారి తన కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం అందించాలని సురక్ష సేవా సంఘంను సంప్రదించాడు. వెంటనే స్పందించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్ పెండ్లి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాగవల్లి యాదగిరి, మహేశ్, యాకూబ్, శిరోమణి, నర్సింహ, చెంగయ్య, హనుమంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

యాచారం, మార్చి27: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం జరిగింది. మండలంలోని కిషన్‌పల్లి గ్రామానికి చెందిన మహేందర్ తన భార్య, కొడుకుతో బైకుపై వెళ్తున్నాడు. కిషన్‌పల్లి గేటు వద్దకు రాగానే బైకును గ్రామానికి మళ్లించేందుకు బైకు నిలిపాడు. ఇంతలోనే బాలాపూర్ లెనిన్‌నగర్‌కు చెందిన యాదగిరి బైకుపై అతి వేగంతో వచ్చి ఆగి ఉన్న బైకును బలంగా ఢీకొట్టాడు. దీంతో యాదగిరి, మహేందర్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌నాయక్ తెలిపారు.

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ బక్కనయాదవ్

షాద్‌నగర్, మార్చి 27 : కార్పొరేట్ బ్యాంక్ సేవలకు దీటుగా పీఏసీఎస్ బ్యాంకులు రైతులకు రుణాల సేవలను అందిస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఫరూఖ్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లోని పీఏసీఎస్ భవనం ఆవరణలో కామన్ సర్వీస్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలో రెండు ధ్యానం నిల్వ గోదాంలను పూర్తిచేశామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, పీఏసీఎస్ కార్యదర్శి రఘునందన్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి

షాబాద్, మార్చి 27: గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చేవెళ్ల డివిజన్ ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార లోపాన్ని నిర్మూలించడమే పోషణాభియాన్ లక్ష్యమని చెప్పారు. చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు, అందుబాటులో ఉండే ఆకుకూరలు తినడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని, ఎనిమియా లాంటి వ్యాధులు సక్రమించవని చెప్పారు. పుట్టిన బిడ్డకు కచ్చితంగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్‌కు పంపించాలన్నారు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, సృజన, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు శ్రీశైలం, విజయశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు మీనా, సౌభాగ్య, అంబుజాక్షి, విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం ఉత్సవాల్లో మాట్లాడుతున్న చేవెళ్ల డివిజన్ సీడీపీవో శోభారాణి

చేవెళ్లటౌన్, మార్చి 27: దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వేంకట్ రెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయ నిర్మాణం కోసం బుధవారం దేవర వేంకట్ రెడ్డి, ఆగిరెడ్డి రూ. 30 లక్షలను విరాళంగా అందజేశారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, మార్చి 27 : మండల పరిధిలోని అల్లవాడ అనుబంధ గ్రామం జాలాగూడాలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతనిస్తున్నారు. బుధవారం గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ చంద్రయ్యగౌడ్ తనయుడు విగ్నేశ్‌గౌడ్ ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మేడిపల్లిలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాచారం, మార్చి27: మండలంలోని మేడిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాంపు ఇన్‌చార్జి బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం సమక్షంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు బీపీ, షుగర్, జనరల్ తదితర పరీక్షలు 157 మందికి నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎస్.ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొరుగు శివలీల, డాక్టర్ యశోద, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

జాబ్‌మేళాలో పాల్గొన్న నవతా రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 27 : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నవతా రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాబ్ హేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాబ్‌మేళాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న సుమారు 200 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వేర్‌హౌస్ సూపర్‌వైజర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా 65 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు మాట్లాడుతూ.కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించటం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలంగాణ స్కిల్‌అండ్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త విజయలక్ష్మి, కెరీర్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త రజిత, ఐఏసీ సమన్వయకర్త పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగోజి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీటి వృథాపై చర్చ జరగాలి

మన్సూరాబాద్, మార్చి 27: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగోల్ డివిజన్ పరిధి జైపురికాలనీలో టౌన్ లెవల్ మహిళా సంఘం సభ్యులకు సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగం అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ర్యాలీ నిర్వహించి ఇంకుడు గుంతల ఆవశ్యకతను మహిళలకు తెలియజేశారు. నీటి సంరక్షణపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హయత్‌నగర్ ప్రాజెక్టు ఆఫీసర్ బలరాం మాట్లాడుతూ.. నీటిని వృథా చేయడం వలన కలిగే అనర్థాలపై స్లమ్ లెవల్ ఫెడరేషన్‌లో మహిళా సంఘం సభ్యులు చర్యలు జరపాలన్నారు.

వారం రోజుల్లో ఎన్నిక నిర్వహించాలి

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై అధికారులకు కోర్టు ఆదేశం

ఆదిబట్ల, మార్చి 27 : ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పంచాయితీ కోర్టు కెక్కింది. వారం రోజుల్లో ఎన్నికను నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై గత నెల అవిశ్వాస తీర్మానం పెట్టారు. మెజార్టీ సభ్యుల ఆమోదంతో వారిని తొలగించారు. దీంతో అప్పటి నుంచి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. నాటి నుంచి జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు బాధ్యతలను అప్పగించారు. కొన్ని రాజకీయ పరిణామాలతో గత నెల పదిహేను రోజులుగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తున్నది. ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ విషయంపై చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న మర్రి నిరంజన్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు వెంటనే మున్సిపల్ చట్టం ప్రకారం వారం రోజుల్లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.

మున్సిపల్ కార్యాలయం

అక్రమ రవాణా నివారణపై శిక్షణ

ఆమనగల్లు, మార్చి 27 :మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ప్రజ్వల హోం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న మానవ అక్రమ రవాణా నివారణపై శిక్షణార గతులు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో రోజా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనుషులను వయస్సు, లింగ బేధం లేకుండా ఆర్థిక అవయవ, లైంగిక స్వభావం కోసం రవాణా చేయటం అమానుషమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు వివరించి మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో తమవంతు బాధ్యత నిర్వహించాలని సూచించారు.అనంతరం మానవ అక్రమ రవాణా అరికట్టుటకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ప్రజ్వల తెలంగాణ టీం సీనియర్ ఫ్యాకల్టీ సురేశ్, అనిల్, అంబర్‌సింగ్, మిథాలిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆమనగల్లు రైతు వేదిక భవనంలో మానవ అక్రమ రవాణా అరికట్టుట సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో రోజా

పేలుడు పదార్థాలు స్వాధీనం

ఆదిబట్ల, మార్చి 27 : అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 35 డిటోనేటర్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సామ రెసిడెన్సి సమీపంలో ఓర్సు వెంకటేశ్, రూపాని గణేశ్, వరి కుప్పల తరుణ్ ఎలాంటి అనుమతులు లేకుండా ముగ్గురు కలిసి బ్లాస్టింగ్‌కు ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారి నుంచి 35 డిటోనేటర్లు ఉన్న రెండు బ్యాగులు, మరో సంచిలో ఉన్న 35 జెలటిన్‌స్టిక్స్, పేలుడుకు వినియోగించే వైర్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఉప్పరిగూడ సహకారసంఘం అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి

- నియామక పత్రం అందజేసిన డీసీవో ధాత్రీదేవి

నియామకపత్రం అందజేస్తున్న డీసీవో ధాత్రీదేవి

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : ఉప్పరిగూడ సహకార సంఘం అధ్యక్షుడిగా శేరిగూడ గ్రామానికి చెందిన పాండురంగారెడ్డిని సంఘం డైరెక్టర్లు బుధవారం ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. బలపరీక్షలో ఆయనతో పాటు వైస్ చైర్మన్ శంకర్ కూడా ఓటమిపాలయ్యారు. దీంతో బుధవారం డీసీవో ధాత్రీదేవి ఆధ్వర్యంలో సహకార సంఘం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లందరిలో మెజార్టీ డైరెక్టర్లు పాండురంగారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. డీసీవో నియామకపత్రాలను అందజేశారు.

నెలరోజుల హైడ్రామాకు తెర

ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లు గతంలో బీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పలువురు బీఆర్ఎస్ డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ నాయకులు నెల రోజుల క్రితం చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. సుమారు నెలరోజుల పాటు డైరెక్టర్లు క్యాంపు రాజకీయాలకు వెళ్లారు. ఎన్నికలకు ఒక్కరోజు ముందు అప్పటి చైర్మన్ కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలకు ఒక్కరోజు ముం దు అవిశ్వాస బలపరీక్ష నిర్వహించినప్పటికీ షీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని, ఫలితాన్ని వెల్లడించవద్దని ఆదేశాలు జారీచేసింది. దీంతో మరో పదిరోజుల పాటు చైర్మన్ ఎన్నికకు బ్రేక్ పడింది. డీసీవో పాండురంగారెడ్డిని ఇన్‌చార్జి అధ్యక్షుడిగా నియమించారు. బుధవారం చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవడానికి డీసీవో నేతృత్వంలో డైరెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో 11మంది డైరెక్టర్లు పాండురంగారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ చిక్కులు లేకుండా.. ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకోవాలి

ఎల్బీనగర్, మార్చి 27: ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోవాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగితే పోలీసులు చర్యలు తీసుకుంటారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి మెట్రో స్టేషన్ పరిసరాల్లో పండ్ల వ్యాపారాలు చేసుకునే వారు తమను వ్యాపారం చేసుకోకుండా అడ్డుకుంటున్నారంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డుపై ఇబ్బందులు కలిగే విధంగా ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తే పోలీసులు అడ్డుకుంటారని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకుంటే మంచిదని అన్నారు. ఈ విషయంలో తాను ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.